# శ్రీ విశ్వనాథ శతకము



రచయిత్రి

శ్రీమతి హరిణి (దుద్యాల) చొప్పకట్ల

harini.choppakatla@gmail.com
https://harini.choppakatla.com
+91 79890 58769

~ సర్వస్వామ్యములు రచయిత్రివి ~



# ఒక వినమ్రమైన మనవి

నేటి కాలానుగుణంగా అక్కడక్కడా యడాగమాలు, గసడదవాలు , ద్రుతప్రకృతికాలు లోపించినా అది పాఠకుల సౌకర్యార్థం చేసిన ఏర్పాటుగా భావించమని ప్రార్థన.

# అంకితం




**నాదు మదిని తీపి నైవేద్యమిడ గోరి**
**యత్నమింప నన్ను నాదరించి !**
**శతకమనిన పాయసమ్మును గ్రహియించు**
**నాది దేవునకిది యంకితమ్ము!!**

# కృతజ్ఞతలు

తేనెలూరు తెలుగులో ఆణిముత్యమంటి ఆటవెలదిలో ఊహించని రీతిలో కొన్ని గంటల వ్యవధిలో నాతో ఈ శతకమును పూర్తి చేయించిన ఆదిదేవునకు నా తొలి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నా ఈ పద్యపయనంలో ఎప్పటి కప్పుడు సత్సంకల్పంతో మాకందరికీ తోడుగా ఉంటూ మా స్ఫూర్తిగా నిలచిన మా గురువుగారు శ్రీ తటవర్తి కళ్యాణ చక్రవర్తి గారికి నా హృదయ పూర్వక ధన్యవాదములు.

పద్య సవరణలు కొరకు అడుగగానే వారి విలువైన సమయం వెచ్చించి చక్కటి సవరణలతో శతకమునకు మరింత వన్నె చేకూర్చిన శ్రీ ప్రసాద్ కట్టుపల్లి గారికి, సాహితీ ప్రపంచం నాకు మాతృ సమానురాలైన శ్రీ నండూరి నాగమణి గారికి ధన్యవాదశతములు.




గౌరవనీయులైన హర్యానా రాష్ట్ర గవర్నర్ గారు

శ్రీ శ్రీ బండారు దత్తాత్రేయ గారికి

శతకోటి నమస్సులు మరియు కృతజ్ఞతలు.

తటవర్తి గురుకులం, ఆస్ట్రేలియా

# శ్రీ గురుభ్యోనమః



అవధాన శారదామూర్తి, ప్రఖ్యాత ఆస్ట్రేలియా అవధాని

**శ్రీ తటవర్తి శ్రీ కల్యాణ చక్రవర్తి గారు**

## శతశతకయజ్ఞము

**గురుకులం కవులు ద్వారా నూరు సంఖ్యలో శతకాలను వ్రాసి ఆవిష్కరిస్తూ , వాటితో పాటు పేదవిద్యార్థుల విద్యకై శతకావిష్కరణ కార్యక్రమాలు చేస్తున్న సామాజిక సాహిత్య కార్యక్రమం.**

**తెలుగుతల్లికి**

**జయము జయము**

# ఆత్మీయమైన పలుకులు

కరుణ గురిసె స్వామి హరుడు కలము జేరి
సన్నుతింపగాను శతకమందు
పలుకజేసినాడు పద్యశతమును తానె
విశ్వనాథుడనిన వృష్టి దయకు!

సూనయైన తాను పూనె రచన సేయ
హరిణి యల్లె సొబగు హరుని కైత
వారణాసి యొక్క వాసి తెలుపగాను
కలము జాలమాయె గంటలందు!

అక్షరములతోడనాశువుగా చెప్పె
పరమశివుని మహిమ పద్యములను
క్షేత్రమహిమ దెలిపి, గీర్వాణి దయతోడ
శతకమునిటు వ్రాసె సౌమ్యరీతి!

అమ్మనగుచునామె యాశీర్వదించెద,
పసిడి శతకములను పలుగ వ్రాయ
ముగ్గురమ్మలెల్ల ముచ్చటగా చేరి
శక్తినొసగు గాక చల్లి కృపను!

చెలమవోలె యూరి శ్రీ యక్షరములవె
గ్రంథరాజములుగ గరిమతోడ
భవితనందు వెలుగ పద్యకావ్యములుగ
నిలిచిపోవునవని నిఖిలముగను!

శ్రీ విశ్వనాథ శతకము. శ్రీమతి చొప్పకట్ల (దుద్యాల) హరిణి కలమునుంచి కేవలం కొన్ని గంటలలో అలవోకగా జాలువారిన అమృతమయమైన శతకము. కాశీక్షేత్ర వర్ణనతో మొదలై, అక్కడి విశ్వనాథ మందిరాన్ని వివరంగా అక్షరాలలో పొదిగి, ఆ తరువాత శివుని మహిమను, దయను తెలియజేసే ఎన్నో గాథలను చెబుతూ, ఆ మారురిపువు యొక్క లీలలను, అపరిమితమైన దయను చక్కని అలతి అలతి పదాలతో పద్యాలలో పొదిగింది ఈ యువకవయిత్రి.

అలాగే, రోజురోజుకూ పెరిగిపోతున్న అకృత్యాలను, అసమానతలను, దుండగుల దుశ్చర్యలను రూపుమాపమంటూ పార్వతీపతిని పదములంటి, పదములతో, పద్యములతో పూజించింది. కొన్ని పద్యములు చూస్తుంటే, నాకు ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. ఎలాంటి కఠినపదాలను ఉపయోగించకుండా, మధురమైన వాడుక పదాలతోనే అందమైన, తీయనైన శతకాన్ని వ్రాసినది ఈ కవయిత్రి.

ఈ పద్యం చూడండి.

**6. భోగములను గోరు భోగివి కావయ్య**
**జలము, పాలు గోరు సౌమ్యరూప**
**పత్ర పుష్పమనిన పరమ ప్రీతిని బొందు**
**వేదవినుత జయము విశ్వనాథ!!**

శివుడు ధనాన్ని, ఆభరణాలను, వైభవాన్ని ఎప్పుడూ కోరుకోడు. ఆయనకి ఇష్టమైనవి దోసెడు నీళ్ళతో, గుప్పెడు బూదితో అభిషేకం మాత్రమే. అదే విషయాన్ని ఎంతో చక్కగా పై పద్యంలో చెప్పింది, చి.సౌ. హరిణి.

అలాగే మరొక పద్యం.

**43. అన్నపూర్ణ వోలె యమ్మ ఆకలి దీర్చ**
**తండ్రివగుచు నీవు తపనదీర్చ**
**కాశిక్షేత్రమదియె కామధేనువు మాకు**
**వేదవినుత జయము విశ్వనాథ!!**

‘ఆకలిని తీర్చే అమ్మ అన్నపూర్ణ, బాధలను తీర్చే అయ్య జంగమయ్య, భయమును తొలగించే ఇల్లు కాశీపురము... ఇవి చాలవా మాకు?’ అంటున్నది హరిణి ఈ పద్యంలో.

చక్కని తేనెయూట వంటి, చెరకురసమును బోలు పద్యములు ఇంకా ఎన్నెన్నో ఉన్నాయి. అన్నీ ముందుమాటలో వ్రాయుట తగదని, రెండు పద్యములను మచ్చుకు ఉదహరించాను.

చక్కని శైలితో, ఇంచక్కని పద్యాల రచన చేసిన చిరంజీవి హరిణి కలంనుండి మరిన్ని శతకజలపాతాలు జాలువారాలని కోరుకుంటూ, శుభాకాంక్షలతో,



**నండూరి సుందరీ నాగమణి,**
**కథారచయిత్రి, పద్యకవయిత్రి**
**విశ్రాంత బ్యాంకు అధికారిణి**

# శ్రీ విశ్వనాథ శతకము

1. శ్రీకరా శరణము శ్రీగౌరినాథ నీ
భవ్యచరిత వ్రాయ పథము జూపి
శతకయజ్ఞమందు సాక్షాత్కరింపుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

**2.** (కాశి ఆలయమునకు ఐదు మండపాలు ఉన్నాయి. ప్రధాన మండపం గర్భగృహం. ఇక్కడ విశ్వనాథుని శివలింగం పూజించబడుతుంది. ఆలయానికి నాలుగు వైపులా నాలుగు మండపాలు ఉన్నాయి: తూర్పున జ్ఞాన మండపం ; పశ్చిమాన రంగ మండపం; ఉత్తరాన ఐశ్వర్య మండపం ; మరియు దక్షిణాన ముక్తి మండపం గలవు)

ఐదు మండపముల మోదదాయిని గాను
నిలిచె పుడమియందు వెలుగుల గుడి
కాశికాపురమ్ము కామధేనుసమము
వేదవినుత జయము విశ్వనాథ!!

3. ‘వరుణ’, ‘యసి’, ‘సురనది’ పారుచు కలిసిన
ముక్తిపురము నిత్యభక్తివరము ;
మునక వేసినంత మోదమునిడునయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

4 భక్తి గంగిగోవు భజనలే పాలుగా
సలుప పూజ నీకు సర్వమొసగి
తపనదీర్చి నడుపు తండ్రివి నీవయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

5. చిత్తశుద్ధితోడ శివరాత్రి తిథియందు
జపము సలిపి కొలుతు శక్తికొలది
ఆదరించిగావుమభిషేకముల్ సేతుఁ
వేదవినుత జయము విశ్వనాథ!!

6. భోగములను గోరు భోగివి కావయ్య
జలము, పాలు గోరు సౌమ్యరూప
పత్ర పుష్పములిడ పరమునిత్తువు స్వామి
వేదవినుత జయము విశ్వనాథ!!

7. పదము మోపినంత పాపముల్ తొలగించి
జన్మవెలుగజేయు శక్తిపురము
ప్రజల హితము గోరి వారణాసి నిడిన
వేదవినుత జయము విశ్వనాథ!!

8. వారణాసియందు ప్రాణము విడువగా
ముక్తి కలుగుననుచు ముదము మీఱ
నమ్మి నిన్ను జేరు నరులను బ్రోచెడి
వేదవినుత జయము విశ్వనాథ!!

9. (వారణాసి లోని తులసి ఘాట్)
తులసి ఘాటు పేర వెలుగులిడుచు నిల్చె
తులసిదాసు గారు తుదకు జనిన
భవ్యతలము నేడు పావనమొనరింప
వేదవినుత జయము విశ్వనాథ!!

10. శోకనాశమగుచు శుభములనిడుమయ్య
ఈశ నిన్ను దలుప నిష్టముగను
భక్తి భావనయన భాగ్యదాయకమని
వేదవినుత జయము విశ్వనాథ!!

11. మంచుకొండ పైన మలయవాసిని తోడ
మమ్ము గాచు దేవ మమత జూపి
శక్తి నిడుమస్వామి సర్వార్థదాయకా
వేదవినుత జయము విశ్వనాథ!!

12. భస్మధారి మమ్ము భద్రముగ గనుము
రుగ్మతలనణచుము రుద్రుడగుచు
పాపహరుడ నతులు భైరవ రూపమా
వేదవినుత జయము విశ్వనాథ!!

13. బ్రహ్మహత్యయనెడి పాపమైన దొలగు
కాశిపురమునందు కాలు నిలుప
నయము గూర్చు క్షేత్రనాథుడా శరణము
వేదవినుత జయము విశ్వనాథ!!

14. కలియుగమ్మునందు కలిమాయ మముగప్ప
నారుపగతు లెల్లనార్తిబెంచి
తాండవమును జేయ తగురీతి గావుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

15. భావమైన నీవె పలుకులైనను నీవె
కరముబట్టి నడుపు కర్తవీవె
కవితలల్లి శతకకర్తగా నిలుపుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

16. భస్మధారి నీదు భక్తులమౌ మమ్ము
భవము దాట విశదపథము జూపి
యుక్తినిడుచు నడిపి ముక్తినొసంగుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

17. బిల్వపత్రము గొని ప్రియముగానర్పింప
సకల శుభములనిడు సారసాక్ష
నిన్ను నమ్మువారి వెన్నుబట్టి నడుపు
వేదవినుత జయము విశ్వనాథ!!

18. లింగరూపమందు లీలావినోదివై
కష్టనష్టములను కడలియందు
వీడక నిను సలుపువినతులు వినుమయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

19. మూడుకన్నుల గని ముచ్చటగా మాకు
నవసరముల దీర్చి యాదుకొనుము
తండ్రివోలె నిలచి తాపముల్ దీర్చెడి
వేదవినుత జయము విశ్వనాథ!!

20. భోగభాగ్యములను యోగకీర్తులనుచు
సిరులకోరబోను సేవలిడుచు
నీపదముల చెంత నిత్యముండినజాలు
వేదవినుత జయము విశ్వనాథ!!

21. యంత్రములె దలుంప నాచార్యులై నేడు
క్షేత్ర గాథ దెలుపు క్షిప్రముగను
పరగ నీదు మహిమ భక్తిమాత్రమె జూపు
వేదవినుత జయము విశ్వనాథ!!

22. వావి వరుసలెల్ల ప్రజలు మరచి నేడు
జంకు గొంకులేక జగతి యందు
తిరుగుచుండ వారి తీరును మార్చుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

23. నిన్ను గొలిచి సతము నీపాద రజమునై
నిలతునయ్య నేను నెమ్మితోడ
దయను జూపి గనుచు దరిజేర్చుకొనుమయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

24. నాట్యమును సలుపగ నటరాజువై నీవు
ముగ్ధమోహనముగ ముదము గూర్చ
భయముబాధలన్ని బాపుమా దేవర
వేదవినుత జయము విశ్వనాథ!!

25. అర్ధదేహమందు నంబను నిలుపుచు
శక్తి మూలమనెడి సత్యమునిల
తెలియజెప్పినట్టి ధిషణదాతవు నీవు
వేదవినుత జయము విశ్వనాథ!!

26. వాయు జలములట్లు ప్రజల మనములెల్ల
కలుషితమవసాగె కలియుగమున
స్వార్థమువిడి నడువ శక్తి నొసంగుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

27. ఢమరుకమ్ము మ్రోగ ఢమఢమ నాదముల్
హృదయకుహరమందు హృద్యమైన
భావనముల నిడగ భయములన్ని దొలగు
వేదవినుత జయము విశ్వనాథ!!

28. నంది వాహనమున నయముగూర్చగ మాకు
వెడలి దేవ రార వినుతి సేయ
భువనములను బ్రోవు భువనైక తేజమా
వేదవినుత జయము విశ్వనాథ!!

29. మాయదొలగ జేయు మన్మథసంహారి
కామ్యములను వీడి కాంక్షదీర
నీదు పూజ సేయు నిరతినిడుము తండ్రి
వేదవినుత జయము విశ్వనాథ!!

30. చంద్రమౌళివగుచు శాంతినిడుము దేవ
నందివాహనునిగ నయముగూర్చి
బాధలన్ని దీర్చు బాణాసురాంతకా
వేదవినుత జయము విశ్వనాథ!!

31. నమక చమక రుద్ర నామవినుత నిన్ను
నిష్ఠతోడ గొలువ నిరతమిలను
శక్తినిడుచు నీదు సన్నిధినిడుమయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

32. వెట్టపెరుగువేళ విపరీత తాపము
నోర్వలేక జనులె యుడుకు వేళ
చలువగూర్చి మమ్ము శశిధరా బ్రోవుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

33. గౌరితోడనీవు కైలాస గిరియందు
తేజరిల్లు సకల తీర్థపాద
నిన్ను గొలచినంత నెరవేరు కామ్యముల్
వేదవినుత జయము విశ్వనాథ!!

34. విశ్వములను నడుపు విశ్వేశ్వరా! నేను
విషయవాంఛలందు వివశునైతి
బంధనాశ పరమ పథమును జూపుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

35. మౌనివర్యులెల్ల మదినందు నినునిల్పి
తపము సలిపిరయ్య తపన మీఱఁ
నీదు పదములు తమ నెలవని నమ్మిరి
వేదవినుత జయము విశ్వనాథ!!

36. కావుమయ్య నన్ను కాత్యాయనీ పతీ
శూలధారి సకల శోక నాశ
శతకమలర భావజాలమై నిలువుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

37. సోమనాథ భవ్య సుందరలింగమా
నీదు దర్శనంబు మోదమిడుచు
సంకటములు బాపి శమమునిడి నడుపు
వేదవినుత జయము విశ్వనాథ!!

38. "భోలె భోలె"యనగ బ్రోవుమా శంకరా
భావముద్భవించి పలుకునటుల
శక్తినిడి నడుపుము శాంకరీ సహితుడై
వేదవినుత జయము విశ్వనాథ!!

39. కర్మలన్నిటికిని కర్త నీవే కదా
కర్మ ఫలమొసగుమ  కరుణ జూపి
సత్ప్రణతులు జేయ సన్మార్గమునిడుము
వేదవినుత జయము విశ్వనాథ!!

40. సన్నుతింప నిన్ను సద్భక్తితోడ నే
బింకమెన్న వీడి పేర్మితోడ
నిపుణమతిని గాగ నిరతినిడుమ దేవ
వేదవినుత జయము విశ్వనాథ!!

41. యుర్విజనులు సేయ నుపవాస దీక్షను
సోమవారమందు శుభము గలుగు
కామితములు దీరి కార్యసిద్ధి కలుగు
వేదవినుత జయము విశ్వనాథ!!

42. (శివునికి ఇష్టమైన పూవులు)
పారిజాతసుమము, బ్రహ్మకమలములు
పొన్నమల్లె, మొగలి, పొగడమల్లె
కుసుమమాలలెల్ల గొనివచ్చి కొలుతును
వేదవినుత జయము విశ్వనాథ!!

43. అన్నపూర్ణ వోలె నమ్మ ఆకలి దీర్చ
తండ్రివగుచు నీవు తపనదీర్చ
కాశికాపురమ్మె కామధేనువు మాకు
వేదవినుత జయము విశ్వనాథ!!

44. విషపునాగులెల్ల పేర్మితో సతతమ్ము
దైవమనుచు నీదు దరిని జేరి
శుభము గూర్చుమనుచు శుశ్రూష సలిపిరి
వేదవినుత జయము విశ్వనాథ!!

45. క్షేత్రపాలకునిగ క్షేమమొసంగుచు
పాపహరము సలిపి భైరవుండు
దుష్ట శిక్షణంబు శిష్ట రక్షణ జేయు
వేదవినుత జయము విశ్వనాథ!!

46. వరములిడగ నిలచె వారాహి మాతయే
కాశియందు సతము కాంతులిడుచు
రాత్రి సమయమునకు రాణియై మఱలును
వేదవినుత జయము విశ్వనాథ!!

47. కల్పనమ్ము జేసి కల్పాంతము వరకు
జగతి సృష్టి జేసి జనులకొసగి
భాగ్యభోగములను బాధ్యతగ నిడిన
వేదవినుత జయము విశ్వనాథ!!

48. కనులవిందు జేయు గంగకు హారతి
కాంతులీనుచుండు కాశియంత
అణువణువున నిలచు నాధ్యాత్మిక తలపు
వేదవినుత జయము విశ్వనాథ!!

49. కరుణనుగన నీవు గ్రహములు నన్నేమి
జేయుననెడి నిత్య చింతన గొని
నీ పదమ్ములు గని నిరతము నిలుతును
వేదవినుత జయము విశ్వనాథ!!

50. ప్రాణపంచకమును పంచేంద్రియమ్ముల‌న్
పంచభూతములను పంచి మాకు
తపన లేక బ్రతుక తగిన మార్గమిడుము
వేదవినుత జయము విశ్వనాథ!!

51. మహితచరిత ! యభవ ! మహిని నడుపు దేవ !
సజ్జనాదులకును శక్తినిడుమ
హితముదెలిపి జనన హేతువున్ దెల్పుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

52. పఠనమలర జేయ పంచాక్షరీ దివ్య
మంత్రమున్ను సతము మదిని బూని
భయములన్నిదొలగి భద్రము చేకూరు
వేదవినుత జయము విశ్వనాథ!!

53. సకల భూత గణపు శక్తుల నణచుచున్
జనుల గాచునట్టి జంగమయ్య
భూతసంఘరాజ భువనైక నాథుడా
వేదవినుత జయము విశ్వనాథ!!

54. పాము, పురుగు, పిట్ట, పశువుగా జనియించి
భరణి తలము గ్రోలి పాకమనుచు
పాపపథము విడిన పరము దక్కుననిన
వేదవినుత జయము విశ్వనాథ!!

55. యాగములను సేయనక్కఱ లేదని
బిల్వపత్రి తోడ ప్రీతినొంది
భోళతనము తోడ బ్రోచెడి దైవమా
వేదవినుత జయము విశ్వనాథ!!

56. కాలభైరవునిగ కాలాత్మ నినుగొల్తు
వీరభద్ర నీకు వినుతి జేతు
రౌద్ర రూపములుగ రుద్రా నను నరయు
వేదవినుత జయము విశ్వనాథ!!

57. భస్మమింత దెచ్చి భస్మార్చనము జేతు
భస్మధారి నీకు భావనమున
పూజలన్ని గొనుచు పుణ్యమునిడుమయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

58. కంఠమందు ఘోర గరళము నిలుపుచు
జనుల బ్రోచినట్టి చలువ నీది
కరుణతోడ జూడ కలిమాయ తొలగును
వేదవినుత జయము విశ్వనాథ!!

59. కలమునందు నిలచి కాలాత్మ నడుపుమా
నిన్ను వేడ గొప్ప నెమ్మి జూపి
పద్యమందు నిలచు పలుకుగావెలుగుము
వేద వినుత జయము విశ్వనాథ!!

60. పరమ పావనమ్ము పరమసాధనమౌను
శుభకరమగు దివ్య శోభనమగు
నీదు చరిత జదువ నిత్యభక్తినిడును
వేద వినుత జయము విశ్వనాథ!!

61. వైద్యనాథ దేవ భవరోగ సంహార
వ్యాధులెల్ల ప్రబల వసుధయందు
రుగ్మతలను బాపి లోకమున్ రక్షించు
వేదవినుత జయము విశ్వనాథ!!

62. (గుంటూరు జిల్లా నరసరావు పేట, కోటప్పకొండ ఆలయం)
తేజరిల్లి నీవు త్రికుటాద్రి శిఖరమున్
వెలసి జ్ఞానమొసగు పింగళాక్ష
విష్ణు, బ్రహ్మ సహిత వేల్పుగా నిలచిన
వేదవినుత జయము విశ్వనాథ!!

63. గురువులెల్ల గొలుచు గురువుగా నిలచుచు
యాత్మ దీప్తి జూపుమాది దేవ
దారి జూపుమయ్య దక్షిణామూర్తివై
వేదవినుత జయము విశ్వనాథ!!

64. కాశి యనిన వెలుగు కాంతిపురమ్మని
మహిమ దెలిపి సతము మహిని నిలిచె
జ్ఞాన, మోక్షములిడు జ్ఞానరూపము నీవు
వేదవినుత జయము విశ్వనాథ!!

**65.** (మణికర్ణికా ఘాట్)

**మహిమ గలిగినట్టి మణికర్ణికా తీర్థ**
**మందు స్నానమిడును మనుజులకును**
**యాగఫలముతోడ భోగ భాగ్యములవె**
**వేదవినుత జయము విశ్వనాథ!!**

**66.** లోలార్క కుండ్ (ఈ కుండములో ఎర్రచందనం, ఎర్రని పుష్పములు వేసి నమస్కారం చేసుకోవాలి)

**రుగ్మతలను బాపు లోలార్క కుండము**
**నందు మునకవేయ నయముగూర్చి**
**యర్కుడిడును నారత యాయురారోగ్యముల్**
**వేదవినుత జయము విశ్వనాథ!!**

**67. సత్యనిష్ఠ తోడ సత్యహరిశ్చంద్ర**
**పథము తుదకు పంచు పరమశాంతి**
**నిజపు శక్తి చూప నీపురమ్మే సాక్షి**
**వేదవినుత జయము విశ్వనాథ!!**

**68. ప్రళయకాలమందు పావన పురమగు**
**కాశి నిలచు దివ్య కాంతితోడ**
**బ్రహ్మ తెలిపెననుచు పలికె పురాణముల్**
**వేదవినుత జయము విశ్వనాథ!!**

69. శివము గూర్చు భవ్య శివరాత్రి తిథియందు
నీదు పూజ సేతు నిగమనేత్ర
ఫలము పత్రమునిడి పరమార్తితో గొల్తు
వేదవినుత జయము విశ్వనాథ!!

70. కాశియందుచేరి కాలుమోపగదల్చి
క్రోధభైరవుడిని గోరి దలువ
దయను జూపి యిడును దైవదర్శనమును
వేదవినుత జయము విశ్వనాథ!!

71. పరమభక్తితోడ హరహరాయని గొల్చి
స్మరణ జేతు మదిని సాధనమున
లింగరూపమందు జంగమయ్యగ దల్తు
వేదవినుత జయము విశ్వనాథ!!

72. సంపదలనొసంగ సంసారమందునే
మునిగియుంటి సతము కనక నిన్ను
బ్రతుకు ధర్మములను వరముగా నిడుమయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

73. అంతరంగమందు నాత్మగా నినుగన
దివ్యసత్త్వమిడుమ దేవ నాకు
కరుణతోడ నన్ను కాంతియై నడుపుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

74. తనువుమోహమందు తగురీతి నిత్యమున్
పూజలన్ని విడచి భోగమందు
తిరుగు మదికి తిరపు తీరును దెలుపుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

75. ఆత్మ విద్యనిడెడియాత్మయోగివి నీవు
తత్వములను దెలుపు త్యాగివీవు
విశ్వరీతి దెలుపు విషయ విరాగివి
వేదవినుత జయము విశ్వనాథ!!

76. జనన మరణమనెడి ఘనవిలాసమునందు
నిలుపవలదు నన్ను నీలకంఠ
శివగణముగ నిల్పి చింతదీర్చుము తండ్రి
వేదవినుత జయము విశ్వనాథ!!

77. నీవు తాకు మనము నిరతము విరబూయు
పారిజాతమువలె పావనముగ
మెరుపుతోడ వెలిగి మిఱుమిట్లు గొలుపును
వేదవినుత జయము విశ్వనాథ!!

78. గుంపులనుచు జనులు గుమిగూడి సతతము
వ్యర్థచర్చలందు వ్యస్థమగుచు
నిన్ను మరచి నడువ వెన్నుతట్టి నడుపు
వేదవినుత జయము విశ్వనాథ!!

79. కష్టపడుటయందె కలదు సౌఖ్యమనుచు
తెలుపుమ ప్రజకెల్ల తెలివినిడుచు
పరులసొత్తు కొరకు ప్రాకులాటను మాన్పి
వేదవినుత జయము విశ్వనాథ!!

80. స్వార్థపూరితమగు జగతియందున నేడు
నిలువలేక పిలువ పలుకుమయ్య
విశ్వరీతి మార్చి వినతులు వినుమయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

81. భావితరములెల్ల భాగ్యములను పొంద
పసిడిగనిగ నిలుపు భారతమును
కలుషితములు బాపి కాశ్యపిన్ బ్రోవుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

82. కవితలల్లి సతము కలముతో నినుగొల్చు
కవులకెల్ల తగిన ఖ్యాతినిడుమ
పదములందు నీవు ప్రణవమై నిలువుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

83. తరువులెన్నొ బెంచు తగురీతిదెల్పుమా
జనులకెల్ల నీవు జగతి కొరకు
చెట్టు లేని వసుధ చింతను గొలుపును
వేదవినుత జయము విశ్వనాథ!!

84. ప్రతిఫలమ్మడుగక భక్తితోడను గొల్తు
మర్మములను వీడి నిర్మలముగ
నిక్కమైన భక్తి నీకు ప్రియమనుచు
వేదవినుత జయము విశ్వనాథ!!

85. దేశ భాషలందు తేనెలొలుకు తెల్గు
రాజులెల్ల మెచ్చు రమణి తెలుగు
తెలుగుభాష సతము వెలుగంగ జేయుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

86. మానసమున మెదులు మధుర భావనలను
పద్య రచనలందు ప్రస్ఫుటముగ
కలిమితోడ నిలుపు కవిగ బెంచుము దేవ
వేదవినుత జయము విశ్వనాథ!!

87. కవులనెల్ల జనులు కాంచక నిలచిరి
కళలయందు ప్రీతి కానరాక
శక్తి నిడుమ కవుల భుక్తి నీవై నిల్చి
వేదవినుత జయము విశ్వనాథ!!

88. నామజపము, సలుప నయమునుగూర్చును
పాపహరముజేసి పరమునిడును
యత్నమింప ఘోర యమబాధ మఱలును
వేదవినుత జయము విశ్వనాథ!!

89. నీ నియోగమెరిగి నిరతము బ్రహ్మయే
సలుపు కార్యములను జగతియందు
నీదు సంజ్ఞ నడుపు నిర్జరులను దేవ
వేదవినుత జయము విశ్వనాథ!!

90. ఆకులలములేల యారాధనము సేయ
నాదు మదిన సుజన మోదితముగ
నర్పణమును సేయనందుకొనుము దేవ
వేదవినుత జయము విశ్వనాథ!!

91. పరులసేవ మించు పరములేదని దల్చి
పూనుకొనగ దేవ పుడమియందు
సతము నన్ను నడుపు శక్తివై నిలువుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

92. వారణాసియందు వరలు విశ్వపతిగ
కామితములు దీర్చు కల్పతరువ
పాపహరము సలిపి పరమును దయజూపు
వేదవినుత జయము విశ్వనాథ!!

93. కంఠభూషణముగ కద్రువ సుతుడైన
వాసుకి నిలచేను వలపుతోడ
సర్పరాజు విమల సద్భక్తి జూపెను
వేదవినుత జయము విశ్వనాథ!!

94. (సూర్య దేవాలయములు)

అర్కశక్తి గూడి యద్భుతముగ నిల్చె
నాలయమ్ములన్ని లీలతోడ
గనిన వారికెల్ల కలుగును శుభములు
వేదవినుత జయము విశ్వనాథ!!

95. దండపాణి వోలె ధరణిని నిల్చిన
కాలభైరవ మము కరుణను గని
తప్పకనిడుము తవదర్శన భాగ్యమ్ము
వేదవినుత జయము విశ్వనాథ!!

96. వారణాసిగాను వాసికెక్కిన నీదు
పురమె మోక్షపురము పుడమియందు
భక్త జనుల కొరకు వసుధను కొలువైన
వేదవినుత జయము విశ్వనాథ!!

97. దుర్గతో నిలచి ప్రదోష మందున నీవు
శోభలీనువేళ  శుభ్రముగను
కోటి కన్నులున్న కొఱఁతగా దోచును
వేదవినుత జయము విశ్వనాథ!!

98. వేలజనులు జేరి వివిధరీతుల నిన్ను
బూజ సేయ గొప్ప పుణ్యమనుచు
కాశి ధరణియందు కైలాసముగనిల్చె
వేదవినుత జయము విశ్వనాథ!!

99. కాలుడైన నీవె డాలువైన నీవె
గరళకంఠమున్న కరుణవీవె
విశ్వశాంతి గూర్చు విశ్వధాతవు నీవె
వేదవినుత జయము విశ్వనాథ!!

(డాలు: శూరత్వము, కాంతి, అందము)

100. ఒక్క దినములోన నిక్కమౌ భక్తిచే
వ్రాయ తరమె నూరు పద్యములను?
సాధ్యమనుచు నడిపి శక్తి నొసగితివి
వేదవినుత జయము విశ్వనాథ!!

101. సలిపెదరుగ దివ్య శవభస్మ ధారణ
ప్రతి దినమ్ము గన ప్రభాతమందు
భస్మ మనిన నీవు భవము నీ భూతియే
వేదవినుత జయము విశ్వనాథ!!

102. అనిలజవముతోడ నక్షయమ్ముగ నేడు
నక్షరములు గూడె నచ్చెరువుగ
తేనెలొలికె నిలచె తీయని శతకమ్ము
వేదవినుత జయము విశ్వనాథ!!

103. గంగ పొంగి కదల కవితలా యీనాడు
సాధ్యపడెను సరస శతకమిటుల
గంగకానతిడిన కైలాస గిరిపతీ
వేదవినుత జయము విశ్వనాథ!!

104. పరమొసంగు సకల ప్రాణిహితంకరా
యోగపథము జూపు నాగధరుడ
శివమయమగు దేవ శివ, నీవె దిక్కయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

105. దొడ్డరీతి వ్రాయ ధూర్జటిన్ గానయ్య
ఛందమింత గనిన సరణినాది
సన్నుతింప సకల శాస్త్రసార మిడుమ
వేదవినుత జయము విశ్వనాథ!!

107. ధర్మపథమునందు తగురీతి నినుగొల్వ
నాల్గు సిరుల నిడుచు నడుపుమయ్య
చరణ సన్నిధాన సౌభాగ్యమిడుమయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

108. భక్తవత్సలాగ్ర ఫణిరాజ భూషణా
సత్ప్రణతులు జేయ సంతతమ్ము
చింతదీర్చి మదిని స్థిరసౌఖ్యమిడుమయ్య
వేదవినుత జయము విశ్వనాథ!!

109. శుభములొసగు దేవ సురసంఘనాయకా
మౌనివర్య పోష మంత్రరూప
భవహరా ననుగను ప్రణుతింప భక్తితో
వేదవినుత జయము విశ్వనాథ!!

110. నిత్య శుభ్ర తేజ నిజశుభాకారమౌ
ప్రణవరూప దేవ ప్రమథనాథ
శక్తి నిడుమ సతము సత్యపాలన జేయ
వేదవినుత జయము విశ్వనాథ!!

111. మక్కువగను వ్రాయ పెక్కు నీ గాథలు
చక్కనైన రీతి చెక్కిన గతి
దిక్కువైన నిన్ను తెలియంగ జేయుమా
వేదవినుత జయము విశ్వనాథ!!

112. జయము జయము నీకు జగదాంబ వల్లభా
జయము జయము నీకు జంగమయ్య
జయము జయము బలుక జయము గూర్చుమ దేవ
వేదవినుత జయము విశ్వనాథ!!

113. జయము శూలపాణి జయము శంకర నీకు
జయము పశుపతీ విజయము నీకు
జయము చంద్రమౌళి జయము భైరవ నీకు
వేదవినుత జయము విశ్వనాథ!!


114. విజయ మంగళములు విశ్వేశ్వరా నీకు
మంగళములు నీకు జంగమయ్య
విజయ మంగళములు వీరభద్రా నీకు
వేదవినుత జయము విశ్వనాథ!!



# రచయిత్రి పరిచయం

నానమ్మ తాతగారు కీ.శే శ్రీ దుద్యాల సుబ్రహ్మణ్యం గారు, శ్రీమతి సుందరమ్మ గారు మరియు అమ్మమ తాతగారు శ్రీ జనమంచి రామసుబ్రహ్మణ్యం గారు, శ్రీమతి రాధమ్మ గారి పాద పద్మములకు నమః స్సుమాంజలులు.

నేను హైదరాబాదు లో జన్మించి మా నాన్న గారి స్వస్థలమైన మదనపల్లె పట్టణమందు విద్యాబుద్ధులు నేర్చుకున్నాను. ఆ తరువాత ఉన్నత విద్యలను హైదరాబాదు లో అభ్యసించి NTR యూనివర్సిటీ నుంచి ఫిజియోథెరపీలో పట్టభద్రురాలి నయ్యాను. మానవ సేవే మాధవ సేవ యని తలచి వైద్య వృత్తి నెంచుకున్నాను. మొదటినుంచి నాకు పెయింటింగ్, పెన్సిల్ స్కెచెస్ వేయడం చాల ఇష్టం అలాగే కథలు, కవితలు వ్రాయడం కూడా చాలా ఇష్టమైనవి. నాకు హైదరాబాదు వాస్తవ్యులైన శ్రీనివాస శ్రీధర్ తో వివాహం జరిగినది, మా వారు సాఫ్టు వేరు రంగములో పని చేస్తున్నారు మాకు ఇద్దరు పిల్లలు అబ్బాయి కార్తిక్ రామ్, అమ్మాయి దుర్గ శర్వాణి.



నా కుంచె నుండి జాలువారిన చిత్రం

**<u>నా రచనలు</u>**

**శ్రీ హరిణి శతకము**

**శ్రీ విఘ్నరాజ శతకము**